బీఆర్ఎస్ హయాంలో యాసంగి సీజన్‌లో చివ్వెంల మండలంలో నిండుగా ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ డీబీఎం 71 కాల్వ

ప్రస్తుతం డీబీఎం 71 కాల్వలో చిన్నపాయలా కనిపిస్తున్న నీటి ప్రవాహం

ఇదీ ఎస్సారెస్పీ కాల్వల్లో సాగునీటి పరిస్థితి

సూర్యాపేట, మార్చి 7 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లాలోని కాళేశ్వరం ఆయకట్టు పరిధిలో గల ఎస్సారెస్పీ ప్రధాన కాల్వల్లో గత బీఆర్ఎస్ హయాంలో నిండుగా తొణికిసలాడుతూ నీళ్లు పారగా, నేడు సన్నటి పాయ కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే నీటి లెక్కలకు, వాస్తవ పరిస్థితికి పొంతన ఉండడం లేదు. జిల్లాలోని ఆయకట్టుకు వారాబందీ షెడ్యూల్‌లో 1,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ 900 క్యూసెక్కులకు మించి రావడం లేదని అధికారులే అంతర్గతంగా చెప్పుకొంటున్నారు.

అన్నదాత 'వరి'గోస

కామారెడ్డి జిల్లాలో ఎన్నో ఆశలతో సాగు చేసిన యాసంగి పంటలు సాగునీళ్లు లేక వాడిపోతున్నాయి. బావులు అడుగంటి, బోర్లు ఎత్తిపోయి పొలాలు ఎండి పోతున్నాయి. మాచారెడ్డి, రాజంపేట్, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఏపుగా ఎదిగిన పైర్లు కండ్ల ముందే పశువులకు మేతగా మారడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. – మాచారెడ్డి/రాజంపేట్

సాగునీరులేక పశువులకు మేతగా



సాగునీరు లేని కారణంగా ఓ రైతు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయాడు. తీరా పంట చేతికొచ్చే సమయానికి చుక్క నీరు కూడా అందని పరిస్థితి నెలకొనడంతో పశువులకు మేతగా పెట్టాడు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలంలో శుక్రవారం ఈ చిత్రం కెమెరా కంటికి చిక్కింది. – చండ్రుగొండ

ఎమ్మెల్యే అయిలయ్య నా బావమరిది.. అయినా లాభం లేదు

బాలరాజు

చివరికి నా పంట ఎండిపోయినా కనీసం వచ్చి చూడలేదు

రైతు ఎమ్మ బాలరాజు ఆవేదన

యాదగిరిగుట్ట, మార్చి 7: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన మేన బావమరిది అని, అయినా ఆయన వల్ల ఎలాంటి ఉపయోగం లేదని రైతు ఎమ్మ బాలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నేను కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తను. ఆలేరు ఎమ్మెల్యేగా మా మేన బావమరిది బీర్ల అయిలయ్య గెలిస్తే బాగుంటుందని భావించా. ఆయకు ఓటేసి గెలిపించాం. కానీ లాభం లేదు. కాళేశ్వరం నీళ్లందిస్తానని ప్రచారం చేసుకున్నాడు. కానీ.. ఒక్క చుక్క కూడా రాలేదు. లో ఓల్టేజీ రావడంతో మోటార్లు నడువక నాకున్న 6ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయింది. ఇప్పటి వరకు నా బావమరిది, ఎమ్మెల్యే అయిలయ్య వచ్చి చూసిపోలేదు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వచ్చి పరామర్శించారు. చాలా సంతోషంగా ఉంది. కేసీఆరే మా నాయకుడు' అని పేర్కొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో యువ రైతు శ్రీకాంత్‌ను ఓదార్చుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

కేసీఆర్ కావాలంటుర్రు: గొంగిడి

'ఏ ప్రాంతానికి వెళ్లినా రైతులంతా కేసీఆర్ సారే ముఖ్యమంత్రి కావాలంటున్నరు.. ఆయన పాలనలోనే రైతులు ఆనందంగా వ్యవసాయం చేసుకునేదని.. సారు పాలనలోనే స్వర్ణయుగంగా వ్యవసాయం సాగిందని స్వయంగా రైతులే కోరుతున్నారు.' అని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యువ రైతు ఎమ్మ శ్రీకాంత్ కుటుంబం బంగారు అభరణాలను కుదువబెట్టి నాలుగు ఎకరాల్లో వరి పంట వేయగా లోఓల్టేజీతో సాగు నీరందక పూర్తిగా ఎండిపోయింది. విషయం తెలుసుకున్న గొంగిడి మహేందర్ రెడ్డి శుక్రవారం శ్రీకాంత్ వరి పంటను పరిశీలించారు. ఆధైర్యపడొద్దని రాబోయేది కేసీఆర్ పాలనేనని, రైతులకు అండగా నిలుస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం జలాలు విడుదల చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో నీళ్లు విడుదల చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రియల్ వ్యాపారులైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, బీర్ల అయిలయ్య ఆలేరు ఎమ్మెల్యేగా కావడం రైతులకు శాపంగా మారిందన్నారు. కేసీఆర్ పదేండ్ల హయాంలో ఏ ఒక్కరోజూ లోఓల్టేజీ సమస్య రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 15నెలల్లో లోఓల్టేజీ వచ్చి పంటలు ఎండుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వరి పంటకు నష్టం జరిగిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, పార్టీ నేత సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదు

రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి బాధ్యత, బాధలేదని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు ఆరోపించారు. శుక్రవారం గద్వాల నియోజకవర్గ పరిధిలో నెట్టెంపాడు లిఫ్ట్ కింద 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, వెంకటాపురం, ఈర్లబండ, గంగన్‌పల్లి, ఇర్కిచెడ్ గ్రామాల పరిధిలో ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు నీరు అందుతాయనే ఆశతో రైతులు పంటలు సాగు చేశారని ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే దశలో చివరి ఆయకట్టు వరకు నీరు రాక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు.– గద్వాల

మా నోట్లో మట్టికొట్టొద్దు

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం విశ్వాసం ఉన్నా రైతుల నోట్లో మట్టికొట్టొద్దు.. వెంటనే రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే ఎల్ఎం6 కెనాల్ పనులు ప్రారంభించండి.. అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఐదో రోజుకు చేరుకున్నది. రిలే దీక్షలో భాగంగా శుక్రవారం రైతులు గొంతులపై కొడవళ్లు పెట్టుకుని నిరసన తెలిపారు.– ఇల్లంతకుంట రూరల్

నీళ్లు లేకపాయే.. పంట ఎండిపాయే..

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం పాతపల్లి శివారులో రైతు వెంకటయ్య రెండెకరాలలో వేరుశనగ పంట సాగు చేయగా.. అర్ధ ఎకరాలో వరి పంట వేశాడు. అయితే గ్రౌండ్ వాటర్ తగ్గి బోరు ఇంకిపోగా.. దీనికి తోడు కరెంట్ కోతలతో పంట ఎండుముఖం పట్టింది. చేసేది లేక గొర్రెలు, పశువులకు మేతగా వదిలేశాడు. – ధన్వాడ

మా నీళ్లు మాగ్గావాలె..

యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు సరిపడా సాగు నీరందక పొట్టదశలో ఎండిపోతున్నాయి. నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నుంచి అదనంగా సాగునీరు విడుదల చేసి ఆదుకోండి.. అంటూ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో పెద్ద కాలువ ఆయకట్టు రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- ఆసిఫాబాద్ జిల్లాలో విషాదం

కౌటాల, మార్చి 7 : అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేటలో జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గుండాయిపేట చెందిన రైతు ఎల్ములే బాబురావు (51)కు 5 ఎకరాల భూమి ఉంది. రూ. 2 లక్షల వరకు అప్పు చేసి అందులో పత్తి వేయగా, 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ భూమి పైనే బాబురావు.. అతడి భార్య మాయాబాయి బ్యాంకులో రూ. 2 లక్షల రుణం తీసుకున్నారు. వీరికి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. ఓ వైపు బ్యాంకు రుణం మాఫీకాక.. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాక బాబురావు తీవ్ర మనస్తాపం చెందాడు. అవితీర్చే మార్గంలేక గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

సీడ్ విత్తే 'షూ'

తక్కువ ఖర్చుతో సులభంగా, వేగంగా విత్తనాలు విత్తడానికి సీడ్ విత్తే షూను తయారు చేసింది కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మిట్టపెల్లి రితిక. గైడ్ టీచర్ జగదీశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో రితిక సీడ్ విత్తే షూ ప్రాజెక్టును తయారు చేసి జనవరిలో జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించగా, జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ యంత్రంతో విత్తనాలు విత్తడం ద్వారా ఖర్చు ఆదా అవుతుందని చెప్పింది. –గంగాధర

కోతకనుకుంటే.. మేతకైంది

- అప్పుచేసి పంట సాగు చేసిన రైతు
- సాగునీరందక ఎండిన పొలం
- జీవాల మేతకు అద్దెకిచ్చిన అన్నదాత

ఎల్లారెడ్డిపేట, మార్చి 7: ఆరుగాలం శ్రమించి పండించిన పంట మరో ఇరవై రోజులు అయితే చేతికివస్తదని ఆ రైతు ఆశగా ఎదురు చూశాడు. కోతకు వస్తుందనకున్న పంట సాగునీరందక కండ్ల ముందే ఎండిపోవడంతో ఆ అన్నదాత దిగాలు చెందాడు. చేసేదేమీ లేక జీవాల మేతకు పంటను ఇచ్చిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. రైతు సంగెం బాలయ్యకు వెంకటాపూర్ శివారులో ఏడెకరాల పొలమున్నది. ఎప్పటిలాగే పంట పండుతుందని రూ.1.80 లక్షలు పెట్టుబడి పెట్టి వరి సాగుచేశాడు. 20 రోజులైతే పంట చేతికొస్తుందనుకునే క్రమంలో భూగర్భజలాలు అడుగంటి బోరులో నీళ్లు రావడం తగ్గింది. దీంతో పొలం నెర్రెలు బారిన పరిస్థితిని చూసి ఏం చేయాలో అర్థంకాక అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరులకు మేకల మేత కోసం అద్దెకిచ్చాడు.

ఇంతటి కష్టం చూడలే..

గత పదేండ్ల నుంచి ఈ ప్రాంత రైతులు ఇంతటి కష్టం చూడలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెరువులు, కుంటలు నింపిండు. భూగర్భజలాలు పెరిగి మంచిగ పంటలు పండినయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధికారులు మా లాంటి రైతుల మొరను ఆలకించాలి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

– సంగెం బాలయ్య, రైతు, వెంకటాపూర్ (ఎల్లారెడ్డిపేట)

గోదావరి జలాల సాధనే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు, మార్చి 7 : గోదావరి జలాల సాధనే లక్ష్యంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టు నిర్మించడంతో తమ పంట భూములకు నీళ్లు వస్తాయని గిరిజనులు, రైతులు ఎంతో సంతోషించారని, గిరిజన ప్రాంత భూములను ఎండబెట్టి మైదాన ప్రాంతాలకు నీళ్లు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఇల్లెందు నియోజకవర్గానికి, భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాలకు గోదావరి నీళ్ల కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ముందుకు సాగుతామన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గోదావరి జలాల తరలింపు, రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని చెప్పారు.

ఎస్సారెస్పీ చివరికి అందని సాగునీరు

- నాటి వరదాయిని పరిధిలో క'న్నీటి' ధారలు
- ఎస్సారెస్పీ ప్రాజెక్టు సాగునీటి కష్టాలు
- చివరి భూములకు అందని సాగునీరు
- ఆయకట్టు పరిధిలో చెరువులు, కుంటలు నింపే బాధ్యతను విస్మరించిన ప్రభుత్వం
- ఫలితంగా అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండుతున్న పంటలు



కరీంనగర్ మండలం నల్లగుంటపల్లిలో ఎండుతున్న పంట పొలం

కరీంనగర్, మార్చి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ జగిత్యాల, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మరో ప్రాజెక్టు పరిధిలోని రైతులకు కష్టాలను తెచ్చిపెట్టింది. ఉత్తర తెలంగాణ వరదాయినిలా మారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్వహణాలోపంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు నెలకొన్నాయి. నీరందక ప్రాజెక్టు జోన్-1, జోన్-2 పరిధిలో యాసంగి పంటలు ఎండుముఖం పట్టాయి. చెరువులను నింపే బాధ్యతను ప్రభుత్వం విస్మరించిన కారణంగా ఉత్తర తెలంగాణ పరిధిలోని జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో జనవరి నెలలోనే 80 శాతం చెరువులు అడుగంటిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే దాదాపు 2,000 చెరువులను నింపే దిశగా చర్యలు తీసుకోకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిరుడు ఆగస్టు మాసంలోనే పూర్తిస్థాయిలో నిండింది. అక్టోబర్ వరకు ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుంచి నీరు వచ్చి చేరుతూనే ఉన్నది. ప్రాజెక్టు సామర్థ్యం కంటే మూడు రెట్లు నీరు రావడంతో గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టులోకి వచ్చి చేరిన నీటితో పాటు, వర్షాధారితంగా చెరువులు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని సంతరించుకోవడంతో వానకాలంలో ప్రాజెక్టు పరిధిలోని పంటలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు. యాసంగిలో సర్కార్ నిర్వహణాలోపంతో రైతులకు ఇబ్బంది కరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. యాసంగిలో జోన్-1, జోన్-2 పరిధిలో ఉన్న నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలో 4,42,920 లక్షల ఎకరాల పంటలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. డిసెంబర్ 25న జోన్ 2కు కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. గత జనవరి 2న జోన్ 1కి నీటి విడుదల చేశారు.

ఏప్రిల్‌లో నీటి విడుదల నిలిపివేత?

నీటి విడుదల ప్రక్రియ ఏప్రిల్ మొదటి వారం వరకే కొనసాగుతుందని అధికారులు తేల్చి చెప్తున్నారు. ఏప్రిల్ 2 నాటికి జోన్-2కు, ఏప్రిల్ 9 నాటికి జోన్-1 పరిధి ఆయకట్టుకు నీటి విడుదల గడువు ముగుస్తుందని చెప్తున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో యాసంగి నార్లు పోయడం ఆలస్యమైంది. జనవరి చివరి వారం వరకు నార్లు పోస్తూనే వచ్చారు. చివర్లో నాట్లేసిన రైతులకు ఏప్రిల్ చివరి వారం నుంచి మే మొదటి రెండు వారాల్లో పంటలు కోతకు వస్తాయి. ఏప్రిల్ 9 నాటికే వారబందీ ప్రకారం నీటి విడుదల ప్రక్రియ నిలిచిపోతే తమ పంటల పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వారబంధీ కారణంగా చివరి భూములకు నీరే అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. జోన్-1, జోన్-2 పరిధిలో ఉన్న గొలుసు కట్టు చెరువులు, కుంటలను ప్రాజెక్టు నీటితో నింపే ప్రక్రియ చేపట్టకపోవడంతో పంటలు ఎండుతున్నాయి.

రైతులకు తప్పని సాగునీటి తిప్పలు

వారాబందీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతున్న జోన్-1, జోన్-2 పరిధిలోని రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలువల నిర్వహణ సరిగా లేక, చాలా చోట్ల మోటర్లతో నీటి చౌర్యంపై అధికారుల నిఘా సరిగా లేక డిస్ట్రిబ్యూటరీల చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు అందడం లేదు. జోన్-1 పరిధిలో ఉన్న జగిత్యాల జిల్లాలోనే వివిధ డిస్ట్రిబ్యూటరీల చివరి ప్రాంతాలకు నీరు అందడం లేదు. జోన్-2 పరిధిలోని వెల్గటూర్ తదితర మండలాల్లోని వివిధ గ్రామాలకు ప్రాజెక్టు నీరు చేరడం లేదు. దీనికి తోడు కాకతీయ ప్రధాన కాలువతోపాటు, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు చాలాచోట్ల లైనింగ్ లేక, పిచ్చిమొక్కలు మెలిచి కాలువలు ధ్వంసమయ్యాయి.